


సంచలన సాయంకాల పత్రిక
# సత్యం
నేటి సందేశం కాదు రేపటి పొద్దు జాడ — 20 YEARS ANNIVERSARY
https://www.satyamdaily.net/
మంగళవారం 12-8-2025
సంపుటి: 21 సంచిక: 120
పేజీలు: 8 వెల: రూ.1





## రామన్న ఇంటికి మళ్లీ ఎర్రన్న

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుకు పుత్రోత్సాహం కలిగింది. రామ్మోహన్ భార్య బండారు శ్రీశ్రావ్య మంగళవారం ఉదయం ఢిల్లీలో మగబిడ్డకు జన్మనిచ్చింది. దీంతో ఎర్రన్నాయుడే మళ్లీ తమ ఇంటికి వచ్చాడని కింజరాపు కుటుంబం సంబరపడుతోంది. శ్రీశ్రావ్యకు పురిటినొప్పులు రావడంతో మంగళవారం ఉదయం 8.30 గంటల ప్రాంతంలో ఢిల్లీలోని ఫోర్టిస్ ప్రసూతి ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ మగబిడ్డ పుట్టాడు.

2017 జూన్ 14న రామ్మోహన్ నాయుడుకు వివాహం కాగా, 2021 జనవరి 30న మొదటి సంతానంగా కుమార్తె పుట్టింది. ఈమెకు మిహిర అన్వి శివంకృతి అనే పేరు పెట్టారు. మళ్లీ 2025లో స్వర్గీయ ఎర్రన్నాయుడే తమ ఇంటికి వచ్చారని కింజరాపు రామ్మోహన్ నాయుడు 'సత్యం'తో తన ఆనందం పంచుకున్నారు.

## 18న సీఎం జిల్లా పర్యటన..?

**❖ పాస్‌బుక్‌ల పంపిణీకి శ్రీకారం**

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఈ నెల 18న సీఎం నారా చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటనకు రానున్నట్టు కలెక్టరేట్‌కు మంగళవారం సీఎంవో సమాచారం ఇచ్చినట్టు తెలిసింది. ఈ నెల 15 తర్వాత కచ్చితంగా ఎప్పుడు వస్తారో డేట్ ఫిక్స్ చేసి చెబుతామని, అందుకు యంత్రాంగం సిద్ధంగా ఉండాలని వర్తమానం వచ్చినట్టు విశ్వసనీయ సమాచారం. వైకాపా హయాంలో జగన్ ఫోటోతో వచ్చిన పాస్‌బుక్‌లను కూటమి ప్రభుత్వం రద్దు చేయడం, పంపిణీ చేసిన వాటిని వెనక్కి తీసుకోవడం చేసింది. వాటిస్థానంలో ప్రభుత్వ రాజముద్రతో కూడిన పాస్‌బుక్‌ను పంపిణీ చేయడానికి సీఎం చంద్రబాబు నిర్ణయించారు. దీంతో జిల్లాలో భారీ బహిరంగ సభను నిర్వహించి పాస్‌బుక్‌లను రైతులకు పంపిణీ చేయాలని నిర్ణయించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉచిత గ్యాస్ సిలిండర్లు పథకాన్ని లాంచ్ చేయడానికి ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని ఈదుపురంలో పర్యటించారు. ఆతర్వాత మత్స్యకార భరోసా మొత్తాన్ని ఖాతాలో జమ చేసిన సందర్భంగా ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెంలో



## సిఫార్సుల పురస్కారాలకు చెక్!

- స్వాతంత్ర్య దినోత్సవానికి భారీగా లిస్టులు పంపిన
- చాంతాడు జాబితాలను తెగ్గొట్టే పనిలో జేసీ
- వాటిలో ఉన్న ఉద్యోగులను పిలిపించి ప్రశ్నల వర్షం
- అచ్చమైన అర్హులనే ఎంపిక చేసి గౌరవించాలని యత్నం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

పంద్రాగస్టు వస్తోంది. ఆరోజు జాతీయ పతాకాన్ని సగర్వంగా ఎగురవేయడం కంటే ఆ సందర్భంగా ఇచ్చే ఉత్తమ సేవల పురస్కారాలపైనే ప్రభుత్వ శాఖల ఉద్యోగులు మొగ్గు చూపిస్తున్నారు. మంచి సర్వీసులు అందించకపోయినా ఏదోవిధంగా ఆయా శాఖల నుంచి జిల్లా అధికారులకు పంపే అర్హుల జాబితాల్లో తమ పేర్లు చేర్పించేశారు. కానీ ప్రతి యేడు మాదిరిగా ఈ జాబితాలకు యథాలాపంగా టిక్ పెట్టేయకుండా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ పలు రకాలు వడపోత కార్యక్రమం చేపడుతుండటంతో ఎప్పటిలా చాంతాడు జాబితాలు పంపిన పలు శాఖల అధికారులు బిక్క మొహం వేస్తున్నారు. రిపబ్లిక్ డే, స్వాతంత్ర్య దినోత్సవాల సందర్భంగా ఉత్తమ ప్రతిభ చూపించే అధికారులు, ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు ఇచ్చి గౌరవించడం ఆనవాయితీగా వస్తోంది. అయితే ప్రతిభ, సేవలతో సంబంధం సిఫార్సులతోనే ఉత్తుముల జాబితాలు చాంతాడులా ఏటేటా పెరిగిపోతున్నాయి. ఆయా శాఖల నుంచి అందే జాబితాలను యథాతథంగా ఆమోదించడం వల్ల ప్రశంసాపత్రాలు అందుకునేవారి సంఖ్య 700కు పెరిగిపోయింది. ఇప్పుడు ఈ దుస్సంప్రదాయానికి ఉన్నతాధికారులు చెక్ పెట్టే పనిలో పడ్డారు. ఆ మేరకు ఈ ఏడాది స్వాతంత్ర్య దినోత్సవంనాడు ఉత్తమ సత్కారాల కోసం శాఖలవారీగా అందిన జాబితాలను జల్లెడ పట్టడం ప్రారంభించారు.

### సూచనలు పట్టించుకోకుండా..

అనవసరంగా ఎక్కువమందిని రివార్డుల జాబితాలో చేర్చి సిఫార్సు చేయవద్దని ఉన్నతాధికారులు మొత్తుకున్నా కొన్ని శాఖల అధికారులు పెద్దగా పట్టించుకోలేదు. ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, ఇతర ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొన్నవారినే ఉత్తమ అధికారులు, ఉద్యోగులుగా ఎంపిక చేయడానికి వీలుగా జాబితాలు సిద్ధం చేయగా.. విమర్శలకు తావులేకుండా అర్హత కలిగిన అధికారులు, ఉద్యోగులను ఎంపిక చేయడానికి జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ శ్రీకారం చుట్టారు. శాఖాధిపతులు పంపిన జాబితాలో ఉన్న అధికారులు, ఉద్యోగులను జేసీ తన ఛాంబర్‌కు పిలిపించుకుని మాట్లాడుతున్నారు. యోగా డే, స్వచ్ఛ భారత్, పింఛన్ల పంపిణీ, పీ-4 బంగారు కుటుంబాలు ఎంపిక, పీజీఆర్ఎస్ సమస్యల పరిష్కారంలో చూపించిన చొరవ తదితర కార్యక్రమాల్లో వారి పోషించిన పాత్ర, చేసిన కృషి ఏమిటన్న కోణంలో జేసీ ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. ఏ కేడర్‌లో ఎప్పుడు విధుల్లో చేరారు, ఇంతకుముందు ఎప్పుడైనా ప్రశంసాపత్రం అందుకున్నారా.. అని ప్రశ్నిస్తూ వివరాలు రాబడుతున్నట్లు తెలిసింది. మరికొందరినైతే మీ పేరునే ఎందుకు సిఫార్సు చేశారని ప్రశ్నిస్తున్నారని చెబుతున్నారు. ఈ ఏడాది పంద్రాగస్టుకు ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థల నుంచి 250కి మించకుండా ప్రశంసాపత్రాలు ఇవ్వాలని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. గతంలో మాదిరిగా ఎవరి సిఫార్సులను పరిగణలోకి తీసుకోకుండా విధుల్లో ప్రతిభ కనబరిచిన వారికి ప్రశంసాపత్రాలు ఇవ్వాలని భావిస్తున్నారు. ఆ మేరకు ప్రభుత్వ శాఖల నుంచి అందే జాబితాలను కుదించే పనిలో జేసీ నిమగ్నమయ్యారని తెలిసింది.



ఒంటరితనం చంపేస్తోంది! - లోపలి పేజీలో
ఉద్యోగం చేస్తున్నట్లు నటిస్తున్న చైనా నిరుద్యోగులు



## విజయాలకు స్ఫూర్తి
# అధికారుల తీరుతో అపఖ్యాతి!

- ⏭ కార్గిల్ పార్కు సాక్షిగా రూ.52 లక్షలు బురదపాలు!
- ⏭ పనులను పట్టించుకోని మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు
- ⏭ సగం పని చేసి చేతులెత్తేసిన ఒక కాంట్రాక్టర్
- ⏭ ఇష్టారాజ్యంగా పనులు చేసిన మరో ఘనుడు
- ⏭ ఉన్న సౌకర్యాలను కూడా ఉడ్చేసిన సమన్వయ లోపం



> ఒక షర్టు కుట్టాలంటే ముందు కటింగ్ మాస్టర్ కోతలేస్తాడు.. ఆ తర్వాత దర్జీ స్టిచ్చింగ్ చేస్తాడు.. కాజాలు కుట్టేవాడొకడు, బొత్తాలు పెట్టేవాడొకడు.. ఉంటారు. చివరకు ఇస్త్రీతో పరిపూర్ణమైన షర్టు మన ఒంటిపైకి వస్తుంది. ఇన్ని విభాగాలను సమన్వయం చేయాలంటే టైలరింగ్ షాపు నిర్వాహకుడికి వాటిపై పూర్తి అవగాహన ఉండాలి. లేకపోతే లేడీస్ టైలర్‌లో రాజేంద్రప్రసాద్ బట్టల సత్తిగాడికి కుట్టిన షర్టు మాదిరిగా తయారవుతుంది పరిస్థితి. సమన్వయం లోపిస్తే ఏ పనైనా అలానే ఏడుస్తుందనడానికి తాజా ఉదాహరణే నగరంలోని కార్గిల్ పార్కు.

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కార్గిల్‌లో పాక్‌పై భారత్ సాధించిన విజయానికి గుర్తుగా స్థానిక జిల్లాపరిషత్ ఎదురుగా ఉన్న హౌసింగ్‌బోర్డు కాలనీలో ఒక పార్కును నిర్మించారు. నగరంలో ఇదే అతి పెద్ద పార్క్. అతి పెద్ద హౌసింగ్ బోర్డు కాలనీకి మధ్యలో ఉన్న ఈ పార్కును స్థానికులు నిత్యం ఉపయోగిస్తుండగా. నాయకులు, అధికారులు మాత్రం దేశభక్తి పొంగిపొర్లే రోజుల్లోనే విజిట్ చేస్తుంటారు. ఆమధ్య ఈ పార్క్ మీద మున్సిపల్ అధికారులకు ప్రేమ పొంగుకొచ్చినట్టుంది. నగరంలో ఎక్కడా లేనివిధంగా అత్యంత సుందరమైన పార్కుగా దీన్ని తీర్చిదిద్దడానికి నడుం బిగించారు. అంతవరకు బాగానే ఉంది. కానీ మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారుల మధ్య సమన్వయం లేకపోవడం, అప్పటి మున్సిపల్ ఇంజినీర్‌కు ఇంజినీరింగ్ పనుల మీద తప్ప మిగతా వాటిపైనే దృష్టి ఉండటం, అసలు కాంట్రాక్టర్ సబ్ కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించడం, మరో కాంట్రాక్టరు తనకు ఇచ్చిన డబ్బులకు ఇంతే పని జరుగుతుందని చేతులెత్తేయడంతో కార్గిల్ పార్కు పరిస్థితి గతంలో కంటే కార్గిల్ పార్క్ పరిస్థితి ప్పుడు ఘోరంగా తయారైంది. ఇప్పుడు కాలనీ వాసులకు.. ఈ పార్క్‌లో అడుగు పెట్టడం, మురుగు కాలువలో కాలు వేయడంలో ఏది కావాలో కోరుకోమంటే.. కాలువ వైపే మొగ్గు చూపుతున్నారు. నగరం నడిబొడ్డులో ఉన్న ఈ పార్క్ కోసం ఇంత ఉపోద్ఘాతము అవసరమా? అని బయటివారికి అనిపించొచ్చు. కానీ అక్షరాలా ఇక్కడ రూ.52 లక్షల రూపాయల పనులు చేసినట్లు మున్సిపల్ కార్యాలయంలో రికార్డులు చెబుతున్నాయి. కాంట్రాక్టర్లకు బిల్లులు ఏమేరకు చెల్లించారు? ఎప్పుడు చెల్లిస్తారు? పక్కన పెడితే.. ఇదంతా ప్రజల సొమ్ము. ఒక్క ఊపిరి పీల్చడానికి తప్ప, అన్నింటి మీదా పన్నులు వేసి సామాన్యుడి నడ్డి విరగ్గొడుతున్న ప్రభుత్వాలు ఇలా ఏమాత్రం బాధ్యత లేని అధికారులను తీసుకువచ్చి శ్రీకాకుళం నగరపాలక సంస్థలో కూర్చోబెట్టి ప్రజాసొమ్మును బురదపాలు చేస్తున్నారనడానికి సాక్ష్యమే కార్గిల్ పార్క్.

### కాంట్రాక్టర్లు.. అధికారులు.. ఎవరి దారి వారిదే

15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి ఈ పార్కుకు రూ.12 లక్షలు కేటాయించారు. పార్క్‌లో మట్టి వేయడం, అందులో మొక్కలు పెంచడానికి ఈ సొమ్ము వినియోగించాలి. అయితే ఎంతమేరకు ఎత్తు చేయాలి? ఏ మెటీరియల్ వాడాలి? ఏ మొక్కలు నాటాలి? అనే స్పెసిఫికేషన్‌లు ఎక్కడా నిర్దేశించలేదు. కాగా ఆ నిధులతో భూమిని కొంత ఎత్తు చేసి.. నాలుగు పిచ్చిమొక్కలు నాటి.. ఇచ్చిన రూ.12 లక్షలకు ఈ పని మాత్రమే అవుతుందంటూ కాంట్రాక్టర్ చేతులు దులిపేసి వెళ్లిపోయాడు. అయినా ఆయనకు బిల్లుల చెల్లింపునకు ఇప్పుడు కార్పొరేషన్ సిద్ధంగా ఉంది. జీఎస్టీ వ్యవహారంలో కిందామీద పడుతుండటం వల్ల ఆలస్యం జరిగిందిమైంది కానీ.. లేదంటే ఈపాటికే బిల్లులు అయిపోయుండేవి. ఇక ఇదే పార్క్ అభివృద్ధి



కోసం 'సుడా' రూ.40 లక్షలు కేటాయించింది. ఈ పనులను దక్కించుకున్న కంట్రాక్టర్.. వాటిని మహేష్ అనే మరో కాంట్రాక్టర్‌కు ధారాదత్తం చేశాడు. పోనీ సబ్ కాంట్రాక్టరైనా సక్రమంగా పనులు చేయించాడా.. అంటే అదీ లేదు. ఈ రూ.40 లక్ష లతో పార్క్ ప్రహరీ ఎత్తు పెంచాలని, వాచ్‌మెన్ రూమ్‌ను పునర్నిర్మించాలని, చిన్నపిల్లలు ఆడుకోడానికి క్రీడా పరికరాలు ఏర్పాటు చేయాలని నిర్దేశించారు. అయితే పార్క్ ప్రహరీని ఎత్తు చేసినప్పుడే దాని లోపల ఫుట్‌పాత్ ఏరియా మొత్తం సిమెంట్ గట్టును కట్టే శారు. ఇప్పుడు ఆ గట్టు వరకు పాత కాంట్రాక్టర్ ఎర్త్ ఫిల్లింగ్ చేయాలి. పార్క్‌లో ఉన్న మట్టికంటే చుట్టూ కట్టిన గట్టు ఎత్తుగా ఉంది. దీంతో వర్షం పడినప్పుడు నీరు ఈ మట్టితో కలిసిపోయి పార్క్ మొత్తం బురదగా మారిపోతోంది. ఇక గ్రీనరీ కోసం ఎంత తక్కువ మాట్లాడుకుంటే అంత మంచిది. చిన్నపిల్లల ఆట పరికరాలు ఎలా ఉన్నాయో ఫొటోలు చూస్తే ఇట్టే అర్థమైపోతుంది. రూ.52 లక్షలతో చేపట్టిన ఈ పనులను మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు ఏరోజూ పర్యవేక్షించలేదని అక్కడి చిన్నపిల్లాడిని అడిగినా చెప్పేస్తాడు. 'సుడా' రూ.40 లక్షలు ఇచ్చి మున్సిపాలిటీ ద్వారా ఈ పనులు చేపట్టాలని కోరింది. ఈ ఒక్క కారణానికే పని కాకముందే పర్సంటేజీలు సెటిలైపోయాయి. కానీ ఇప్పటి వరకు ఈ రెండు పనుల మధ్య సమన్వయం ఉన్నట్టు కనిపించడంలేదు. పిచ్చిపిచ్చి రంగులతో ప్రహరీ, బురద, మట్టితో పార్క్ చూసినవారు ఈ జిల్లాకు 75 వసంతాలు పూర్తి అవుతున్న సందర్భంగానైనా దీనిపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

• ఎడిటోరియల్

# ఒంటరితనం చంపేస్తోంది!

'జగమంత కుటుంబం నాది.. ఏకాకి జీవితం నాది'.. అని అన్నాడో సినీ కవి. ఇప్పుడు మనుషుల పరిస్థితి అచ్చం ఇలాగే ఉంది. చుట్టూ ఎంతమంది ఉన్నా.. కుటుంబం, బంధువులు ఉన్నా.. కష్టం వచ్చినప్పుడు ఆదుకోవడం సంగతెలా ఉన్నా.. కనీసం మనసు విప్పి చెప్పుకొనేందుకు, గుండెల్లోని భారం తీర్చుకునేందుకు.. కాసింత ఓదార్పు పొందేందుకుగానీ 'మన' అనుకునేవారు ఒక్కరూ కనిపించని పరిస్థితి సమాజంలో నెలకొంది. మరోవైపు అక్కున చేర్చుకునేవారు ఎందరున్నా.. ఎవరితోనూ కలవలేక ఒంటరిగా మిగిలిపోయేవారు మరికొందరు. తమను తాము ఒంటరిగా ఫీలయ్యేవారిని ఇంట్రావర్ట్‌లు (అంతర్ముఖులు) అంటారు. ఇదే శృతిమించితే ఒక మానసిక రుగ్మతగా మారిపోయి ప్రమాదకరంగా పరిణమిస్తుంది. ఈ ఒంటరితనమే కుంగుబాటు(డిప్రెషన్)కు.. అక్కడి నుంచి ఆత్మహత్య చేసుకోవాలనుకోవడం వంటి విపరీత ఆలోచనలకు పురిగొల్పుతుంది. ప్రపంచంలో ఇలా ఒంటరితనంతో బాధపడుతున్నవారు.. ఈ రుగ్మతల కారణంగానే ఆత్మహత్యలు వంటి బలవన్మరణాలకు పాల్పడుతున్నవారు లక్షల్లోనే ఉన్నారనడం ఆశ్చర్యం కలిగించేదే అయినా కఠోర వాస్తవం. ప్రపంచ ఆరోగ్య సంస్థకు చెందిన 'కమిషన్ ఆన్ సోషల్ కనెక్షన్' విభాగం తన తాజా నివేదికలో పేర్కొన్న గణాంకాలే దీనికి నిదర్శనం. ఈ నివేదిక ప్రకారం.. ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఆరుగురిలో ఒకరు ఒంటరితనంతో బాధపడుతున్నారు. ఇదే కారణంతో ప్రతి గంట వ్యవధిలో దాదాపు 100 మరణాలు సంభవిస్తున్నాయి. ఫలితంగా ఏడాదికి సుమారు 8.71 లక్షల మరణాలు నమోదవుతున్నాయి. ఒంటరితనానికి వయసుతో సంబంధం లేదు. ఈ సమస్యతో బాధపడుతున్నవారిలో అన్ని వయసులవారూ ఉన్నారు. కాకపోతే పిల్లలు, వృద్ధులతో పోలిస్తే యువతలోనే దీని బాధితుల సంఖ్య ఎక్కువ. వృద్ధుల్లో ప్రతి ముగ్గురిలో ఒకరు, యువ ప్రాయంలో ఉన్నవారిలో ప్రతి నలుగురిలో ఒకరు ఒంటరులే. ఏకాకి జీవితంతో విసిగిపోతున్నవారి సంఖ్య.. దిగువ, మధ్య ఆదాయ దేశాల్లో ఎక్కువగా ఉంది. అధికాదాయ దేశాల్లో ఒంటరితనం బాధితుల సంఖ్య 11 శాతంగా ఉంటే.. అల్పాదాయ దేశాల్లో ఆ సంఖ్య 24 శాతంగా ఉంది. 13 నుంచి 29 ఏళ్లవారిలో ఒంటరితనంతో బాధపడుతున్నవారి సంఖ్య 17 నుంచి 21 శాతంగా ఉంది. టీనేజర్లు అంటే యువతలో ఈ సమస్య చాలా ఎక్కువగా ఉన్నట్లు ఇదొక్కటే కాకుండా అనేక నివేదికలు వెల్లడిస్తున్నాయి. అత్యధికంగా 13 నుంచి 17 ఏళ్ల యవతలో 20.9 శాతం మందిని ఒంటరితనం వెంటాడుతోంది. ఇది కూడా తక్కువ, మధ్య ఆదాయ దేశాల్లోని యువతనే అధికంగా చిదిమేస్తోంది. మరో షాకింగ్ విషయం ఏంటంటే.. ఇలా ఒంటరితనం ఫీల్ అవుతున్న యువత చదువులో తక్కువ గ్రేడ్లు సాధించే ప్రమాదం 22 శాతం అధికంగా ఉందట. ప్రస్తుత డిజిటల్ యుగం ప్రపంచం నలుమూలల ఉన్నవారిని అత్యంత సులభంగా పరస్పరం కనెక్ట్ చేసుకోగలిగే సౌకర్యం కల్పిస్తోంది. కానీ సెల్‌ఫోన్లు, టీవీలు, ఇంటర్నెట్ వంటి సాంకేతిక సౌలభ్యాల ఉచ్చులో చిక్కుకుని మానవ సంబంధాలు దెబ్బతింటున్నాయని నిపుణులు అంటున్నారు. నిరంతరం ఫోన్లు, కంప్యూటర్లలో లీనమైపోతున్న టీనేజర్లు, యువత తమకు తెలియకుండానే మానవ సంబంధాలను మర్చిపోతున్నారు.. కోల్పోతున్నారు. దానివల్ల సోషల్ ఇంటరాక్షన్ ఉండదు. దీనికితోడు దీర్ఘకాలిక వ్యాధులు, వైకల్యాలు, ఇతర శారీరక, మానసిక సమస్యలు, ఆత్మన్యూనత భావం వంటివి ఒంటరితనానికి దారితీస్తున్నాయి. సంపాదన, ఇతర వ్యాపకాల్లో బిజీ అయిపోయి తల్లిదండ్రులు తమ పిల్లలకు తగిన సమయం కేటాయించకపోవడం, పిల్లలు ఏం చేస్తున్నారన్నది కూడా గమనించకపోవడం వల్ల టీనేజర్లు ఒంటరితనానికి గురవుతూ మానసికంగా దెబ్బతింటున్నారు. దీనికి విరుగుడు సామాజిక సంబంధాలను పెంచుకోవడమేనని డబ్ల్యూహెచ్‌వో నివేదిక సూచించింది. ఇతరులతో కలవడానికి అసంఖ్యామైన అవకాశాలున్న ఈ రోజుల్లో చాలామంది తమను తాము ఒంటరివ్యక్తులుగా భావించుకుంటున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ డైరెక్టర్ జనరల్ డాక్టర్ టెడ్రోస్ అధనోమ్ వ్యాఖ్యానించారు. డబ్ల్యూహెచ్‌వో కమిషన్ ఆన్ సోషల్ కనెక్షన్ సహాధ్యక్షుడు డాక్టర్ వివేక్ మూర్తి మాట్లాడుతూ ఈతరం ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాల్ ఒంటరితనమేనని అభివర్ణించారు. పెరుగుతున్న టెక్నాలజీ మనకు అదనపు బలంగా ఉండాలే తప్ప బలహీనతగా మారకూడదని ఆయన అన్నారు. ఇది జరగాలంటే ప్రభుత్వ విధానాలన్నింటిలోనూ సామాజిక అనుసంధానాన్ని తప్పనిసరి చేయాల్సి ఉంటుంది.

## శ్రీకాకుళం జిల్లా విశిష్టతపై పోటీలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం జిల్లా ఏర్పడి 75ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల నరసన్నపేటలో వివిధ రకాల పోటీలను నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ పవన్ మరపట్ల తెలిపారు. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పునర్కర్, డీవీఈఓ పి.దుర్గారావు ఆదేశాల మేరకు శ్రీకాకుళం జిల్లా సంస్కృతి చరిత్రను ప్రతిబింబించేలా చిత్రలేఖనం వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్ణయించినట్లు పవన్ పేర్కొన్నారు. ఈ పోటీలలో నరసన్నపేట నియోజకవర్గంలోని సారవకోట, పోలాకి, జలుమూరు, నరసన్నపేట మండలాలకు చెందిన వివిధ ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలకు చెందిన సుమారు 150మంది విద్యార్థులు పాల్గొన్నారని ప్రిన్సిపాల్ తెలిపారు. నియోజకవర్గస్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచిన విజేతలు జిల్లాస్థాయిలో జరిగే పోటీలకు ఎంపిక అవుతారన్నారు. అధ్యాపకులు శివరాంప్రసాద్, సత్యనారాయణ, వేణుగోపాలరావు, నాగకుమారి, విశ్వప్రసాద్, ఆనందరావు, రాంప్ర సాద్ తదితరులు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారని తెలిపారు.



## పులివెందులలో ప్రజాస్వామ్య హత్య



(సత్యంన్యూస్, నరసన్నపేట)

పులివెందులలో జరుగుతున్న జెడ్పీటీసీ ఎన్నికల సందర్భంగా ప్రజాస్వామ్య హత్య జరుగుతోందని మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్ విమర్శించారు. ఈమేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పులివెందులలో ప్రజాస్వామ్యం పూర్తిగా హరించబడిందన్నారు. వైకాపా జెడ్పీటీసీ అభ్యర్థికి కూడా ఓటు వేయకుండా అడ్డుకోవడం అంటే పరిస్థితులు ఎంత దిగజారిపోయాయో అర్థం చేసుకోవచ్చన్నారు. ఇది పాలకుల చేతగానితనానికి, నిరంకుశత్వానికి నిదర్శనమన్నారు. ప్రజలు ఓటు వేయకుండా అడ్డుకోవడం ఎన్నికల ప్రక్రియను హత్య చేసినట్లేనన్నారు. ఎంపీ అవినాష్‌రెడ్డి అరెస్టు పూర్తిగా అక్రమం, రాజకీయ కక్షసాధింపునకు నిదర్శనమని విమర్శించారు. తెల్లవారుజామున సమాచారం ఇవ్వకుండా, ఎలాంటి చట్టబద్ధ కారణం లేకుండా ఆయనను హౌస్ అరెస్ట్ చేసి, తరువాత అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు. పులివెందుల జడ్పిటిసి ఎన్నికలను స్వేచ్ఛాయుత, నిష్పక్షపాతంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. జరిగిన అక్రమాలపై న్యాయమూర్తి ఆధ్వర్యంలో ఉన్నతస్థాయి విచారణ జరపాలన్నారు.

### జీవనశైలి, ఆహారపు అలవాట్లతో

## క్యాన్సర్ ముప్పు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

బ్రెస్ట్ క్యాన్సర్ గుర్తింపులో 'మేమోగ్రామ్' స్క్రీనింగ్ పరీక్ష కీలకమని లయన్స్‌క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షురాలు డాక్టర్ పైడి సింధూర పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మునసబుపేట గాయత్రీ కాలేజీ ఆఫ్ సైన్స్ అండ్ మేనేజ్మెంట్ కళాశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ భారతదేశంలో క్యాన్సర్ బారిన పడుతున్న మహిళల్లో 28శాతం బ్రెస్ట్ క్యాన్సర్ బారిన పడుతున్నారని, అంతటి ప్రమాదకర బ్రెస్ట్ క్యాన్సర్ ఆదిలోనే గుర్తించే ప్రక్రియ మేమోగ్రామ్ ప్రాముఖ్యత గురించి ప్రతి ఒక్కరు తెలుసుకోవాలన్నారు. ప్రతి మహిళ బ్రెస్ట్‌క్యాన్సర్ గుర్తింపుకై మేమోగ్రామ్ పరీక్షను ఏడాదికి ఒకసారి చేయించుకోవాలని, విద్యార్థి దశనుండే అవగాహన కలిగి ఉంటే, కాన్సర్‌ను జయించవచ్చని, మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లు, క్యాన్సర్ పెరుగుదలకు ప్రధాన కారణమన్నారు. విశిష్ట అతిథిగా హాజరైన డాక్టర్ బగాది. శ్రావ్య మాట్లాడుతూ బ్రెస్ట్‌లో గడ్డలు కలిగి ఉన్నవారు, బ్రెస్ట్ నుండి ఎటువంటి స్రవాలు విడుదలైనా, నొప్పి కలిగి ఉన్నటువంటి పరిస్థితుల్లో తక్షణమే వైద్యుని సంప్రదించాలని, తద్వారా వ్యాధి తీవ్రతను తగ్గించడం, నివారించడం సాధ్యపడుతుందన్నారు. తాజాకూరగాయలు, పండ్లు, ఇంట్లో తయారుచేసిన ఆహారాన్ని భుజించటం శ్రేయస్కరమన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ కేవీ సత్యన్నారాయణ మాట్లాడుతూ మహిళల్లో బ్రెస్ట్ క్యాన్సర్ నిర్మూలనకు సంపూర్ణ అవగాహన అవసరమన్నారు. కార్యక్రమానికి హాజరైన ప్రతి విద్యార్థిని వారి మాతృమూర్తులకు వారి వారి గ్రామాల్లోని మహిళలకు మేమోగ్రామ్ పరీక్ష ప్రాముఖ్యతను వివరిస్తూ అవగాహన పరచాలన్నారు. కార్యక్రమంలో ఎన్. రమ్య, పొడుగు చరణ్, ఇతర సభ్యుల బృందం, కళాశాల ఉపాధ్యాయ, బోధనేతర సిబ్బంది, విద్యార్థినిలు పాల్గొన్నారు.




## విద్యార్థుల్లో సృజనాత్మకత వెలికి తీయవచ్చు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

చిత్రలేఖనం ద్వారా విద్యార్థులలో సృజనాత్మకతను పెంపొందించడం సాధ్యమవుతుందని బీహెచ్‌ఆర్సీ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షులు మణిశర్మ, జిల్లా అధ్యక్షులు రౌతు సూర్య నారాయణ పేర్కొన్నారు. స్వాతంత్ర్యదినోత్సవం పురస్కరించుకొని నగరంలోని ఎన్జీవో హోంలో చిత్రలేఖన పోటీలను భారతీయ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిత్రలేఖనం ద్వారా విద్యార్థుల్లో ఆలోచనాశక్తిని, సమస్యలను పరిష్కరించే నైపుణ్యాన్ని, భావ వ్యక్తీకరణను మెరుగుపరుస్తుందన్నారు. సృజనాత్మకతను పెంపొందించడానికి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థులను ప్రోత్సహించాలని సూచించారు. విద్యార్థులు తమ ఆలోచనలను స్వేచ్ఛగా వ్యక్తం చేయడానికి భయపడకూడదన్నారు. పెయింటింగ్, డ్రాయింగ్, సంగీతం, నృత్యం, నాటకం మొదలైన వాటిలో పాల్గొనడం ద్వారా విద్యార్థులు



సృజనాత్మకంగా ఆలోచించడానికి అవకాశం లభిస్తుందన్నారు. విద్యార్థులు సృజనాత్మకతను పెంచుకొని చదివితే ఉన్నతస్థితిలో రాణించగలుగుతారని వివరించారు. పెయింటింగ్ పోటీల్లో మొదటి దశను ఆయా పాఠశాలల్లో నిర్వహించామని, రెండో దశను అన్ని పాఠశాల విద్యార్థులకు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సామాజికవేత్త జైశ్రీరామ్, బీహెచ్‌ఆర్సీ నగర అధ్యక్షులు ఆకుల కృష్ణ, యూత్ వింగ్ అధ్యక్షులు కార్తీక్‌తో పాటు, పలు ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.




### రీఎంట్రీ సరే గానీ..

# కుర్ర వేషాలొద్దు నవీనూ..!

నిన్న ఈటీవీ ప్లస్‌లో రాత్రి చాలా బాగుంది అనే సినిమా వస్తోంది. వడ్డే నవీన్, శ్రీకాంత్ నటించారు. మాళవిక హీరోయిన్.. ఈవీవీ సినిమా.. పెద్దగా కథ అంతగా ఆకట్టుకునేలా లేకపోయినా సినిమాలో ఎల్బీ శ్రీరాం పోషించిన గంటస్తంభం వెంకటేశ్వరరావు అనే ఒక విలక్షణమైన పాత్ర హైలైట్.. ఆ పాత్ర సంభాషణలు కూడా చాలా డిఫరెంట్..! వడ్డే నవీన్‌ను చూస్తుంటే అనిపించింది. మాంచి బ్యాక్‌గ్రౌండ్ ఉన్నా సరే అది ఎంట్రీ వరకే తప్ప నిలదొక్కుకోవడానికి పనికిరాదు కదా అని..! తండ్రి వడ్డే రమేష్ నిర్మాత.. 1996 నుంచీ నవీన్ ఫీల్డులో ఉన్నాడు. కిందామీదా పడీపడీ 2006 దాకా ప్రయత్నిస్తూనే ఉన్నాడు గానీ సక్సెస్ తన దరిదాపుల్లోకి కూడా రాలేదు. పెళ్లి అనే ఒక్క సినిమా మాత్రం కాస్త పర్లేదు అనుకుంటా..! అదీ సుజాత, పృథ్విరాజ్ పోషించిన పాత్రలు, ఆ కథ, కొంతవరకూ కోడి రామకృష్ణ దర్శకత్వ ప్రతిభ వల్లే..! 2006 తరువాత ఒకటీరెండు చిన్న చిన్న పాత్రలు వేశాడు. ఒకటోరెండో సినిమాల్ని తనే నిర్మించాడు.

2016లో ఎటాక్ అనే సినిమా.. అంతే ఇక..తను పూర్తిగా తెరమరుగే అనుకున్నారందరూ.. తాజాగా మళ్లీ తను హీరోగా, తనే ఓ సినిమా నిర్మిస్తున్నాడని వార్తలు వచ్చాయి.

చాలామంది కొత్తవాళ్లు, యువ హీరోలు వస్తున్నారు.. సినిమా నవీన్‌ను దాటేసి చాలా ముందుకు పోయింది. ఫస్ట్ ఇన్నింగ్సే ఒడిదొడుకులు.. ఇక సెకండ్ ఇన్నింగ్స్‌లో జనం యాక్సెప్టెన్స్ ఏమేరకు లభిస్తుందో చూడాల్సిందే..

ఎందుకంటే..? తన ఫేస్ కట్ మారిపోయింది. మరీ ఇప్పటి హీరోల టైపు మాస్ పాత్రలు, రొటీన్ కథలు గాకుండా, తనకు సూటయ్యే ఏదైనా లీడ్ రోల్ చేస్తే బెటర్.. అబ్బే, 60, 70 లు దాటినా సరే, అంతటి సీనియర్లు కుర్రవేషాలు వేస్తే చూడటం లేదా అంటారా..?

వాళ్లు వేరు.. వాళ్ల ఇమేజ్ వేరు.. ఫ్యాన్ ఫాలోయింగ్ వేరు.. వాళ్ల సినిమా కెరీర్‌లో గ్యాప్ లేదు. కంటిన్యూటీ ఉంది.. కానీ వడ్డే నవీన్ ఎవరో ఈ తరానికి అసలు తెలియదు. అంత గ్యాప్ వచ్చింది, దాదాపు పదేళ్లు.. అందుకే ఆడియెన్స్ యాక్సెప్టెన్సీ డౌట్‌ఫుల్..

అన్నట్టు.. నవీన్ నందమూరి ఇంటల్లుడు. ఎన్టీయార్ కొడుకు రామకృష్ణ కూతురు చాముండేశ్వరిని పెళ్లి చేసుకున్నాడు. తరువాత శృతి కుదరలేదు, విడాకులు తీసుకున్నారు. ఆ విడాకుల తరువాతే ఇండస్ట్రీలో తనను పట్టించుకునేవాళ్లు లేక, అవకాశాల్లేక తెరమరుగు అయ్యాడంటారు మరి..!

- ముచ్చట సౌజన్యంతో...

# టాలీవుడ్‌కి గుడ్‌బై చెప్పినట్టేనా..?



కమల్ హాసన్ గారాల పట్టి శృతి హాసన్ టాలీవుడ్ కి దాదాపు గుడ్ బై చెప్పినట్టే అనిపిస్తుంది. ఆమె వ్యవహార శైలి చూస్తే అది నిజం అనేలా ఉంది. ఎందుకంటే అమ్మడు తెలుగులో సినిమాలు చేయాలన్న ఆసక్తి చూపించట్లేదు. ఒకటి అర సినిమాలు చేసినా వాటి మీద అంత ఆసక్తి చూపించట్లేదట. అడివి శేష్ తో డెకాయిట్ సినిమా ముందు శృతి హాసన్ తోనే చేయాలని అనుకున్నారు. ఆమెతో టీజర్ కూడా రిలీజ్ చేశారు. కానీ ఏమైందో ఏమో సడెన్‌గా శృతి హాసన్ ప్లేస్‌లో మృణాల్ ఠాకూర్ వచ్చింది.

**కెరీర్ పీక్స్ లో ఉన్న టైంలో కూడా..**

టాలీవుడ్ లో శృతికి వచ్చేదే అర కొర అవకాశాలు వాటిని కూడా అమ్మడు చేజార్చుకుంటుంది. దీని వెనక రీజన్స్ ఏమై ఉండొచ్చు అని ఆడియన్స్ డిస్కషన్ చేస్తున్నారు. ఇప్పుడే కాదు కెరీర్ పీక్స్ లో ఉన్న టైంలో కూడా శృతి హాసన్ తెలుగు దర్శక నిర్మాతలను కాస్త ఇబ్బంది పెట్టేదని టాక్ ఉంది. సినిమా కమిట్ అవ్వడం వరకు ఓకే ఆ తర్వాత అమ్మడు డేట్స్ విషయంలో ఇబ్బందులు పెడుతుందని ఇన్నర్ టాక్. అందుకే అంతకుముందు కూడా శృతి హాసన్ చేయాల్సిన కొన్ని సినిమాలు వేరే హీరోయిన్స్ ని పెట్టి చేశారు. అడివి శేష్ డెకాయిట్ సినిమాలో శృతి హాసన్ ఉంటే బాగుండేదని అనుకున్నారు. కానీ ఆమెకు ఛాన్స్ లేదు. ఈ పరిస్థితులన్నీ చూస్తుంటే శృతి హాసన్ తెలుగు సినిమాలను దాదాపు దూరం పెట్టినట్టే ఉంది. ప్రభాస్‌తో సలార్‌లో నటించిన శృతి హాసన్ ఆ సినిమా సెకండ్ పార్ట్ లో కూడా నటించాల్సి ఉంది. అది ఎలాగు కమిట్ అయ్యింది కాబట్టి తప్పదు. కానీ ఇక మీదట తన పూర్తి ఫోకస్ అంతా కూడా కోలీవుడ్ మీదే పెట్టాలని చూస్తుంది అమ్మడు. శృతి హాసన్ పర్సనల్‌గా కూడా లైఫ్‌ని సూపర్‌గా ఎంజాయ్ చేస్తుంది. ఏ విషయం గురించి పెద్దగా సీరియస్‌గా తీసుకోదు అమ్మడు. ఐతే సౌత్‌లో క్రేజీ హీరోయిన్‌గా పేరు తెచ్చుకున్న శృతిహాసన్ కెరీర్‌లో మొదటి హిట్ కొట్టింది మాత్రమే తెలుగు సినిమాతోనే. అది కూడా పవర్ స్టార్‌తో చేసిన గబ్బర్ సింగ్ సినిమాతోనే ఆమె సూపర్ హిట్ అందుకున్నారు. అప్పటి నుంచి శృతి హాసన్ ఇక తిరిగి చూసుకోలేదు. ప్రజెంట్ శృతి హాసన్ సూపర్ స్టార్ర్ రజినీకాంత్ కూలీ సినిమాలో నటించింది. మరో రెండు రోజుల్లో రిలీజ్ కాబోతున్న కూలీ సినిమాతో ప్రేక్షకులను అలరించనుంది శృతి హాసన్. ఈ మూవీ మీద శృతిహాసన్ చాలా హోప్స్ పెట్టుకుంది. మరి అమ్మడి పెట్టుకున్న ఈ హోప్స్ ఎంతవరకు నిజం అవుతాయన్నది చూడాలి.

- తుపాకి.కామ్ సౌజన్యంతో...



జీతం లేకుండా పని చేయడానికి ఎవరూ ఇష్టపడరు. అందులోనూ ఆఫీసులో ఉన్నందుకు ఎదురు డబ్బులు చెల్లించడం అసలే ఉండదు. కానీ, కంపెనీలకు డబ్బులు చెల్లిస్తూ, ఉద్యోగం చేస్తున్నట్లు నటించే నిరుద్యోగుల సంఖ్య చైనాలో పెరిగింది. దీంతో ఇలాంటి సర్వీసు అందిస్తున్న కంపెనీల సంఖ్య కూడా పెరుగుతోంది. చైనాలో ఆర్థిక వ్యవస్థ, ఉద్యోగాల మార్కెట్ కూలిపోవడంతో ఇలాంటి పరిస్థితి ఏర్పడింది. అక్కడ నిరుద్యోగం 14 శాతం కంటే ఎక్కువగా ఉంది. నిజమైన ఉద్యోగాలు పెరగడం కష్టం కావడంతో, కొంతమంది యువకులు ఇంట్లో ఉండే బదులు డబ్బులు చెల్లించి మరీ ఆఫీసుకు వెళుతున్నారు.

# ఉద్యోగం చేస్తున్నట్లు నటిస్తున్న

# చైనా నిరుద్యోగులు





30 ఏళ్ల షుయి ఝౌకు ఫుడ్ బిజినెస్ ఉంది. 2024లో అది మూతపడింది. దీంతో ఆయన ఈ ఏడాది ఏప్రిల్ నుంచి రోజుకు 30 యువాన్లు చెల్లిస్తూ ప్రిటెండ్ టు వర్క్ అనే కంపెనీకి వెళుతున్నారు. ఈ కంపెనీ హాంగ్‌కాంగ్‌కు ఉత్తరాన ఉన్న డోంగ్గువాన్ అనే నగరంలో ఉంది. ఆయన చేరిన ఆఫీసులోనే ఆయనలాంటి మరో ఐదుగురు సహచరులు ఉన్నారు. 'నాకు చాలా సంతోషంగా ఉంది. మేమంతా ఒక గ్రూప్‌గా కలిసి పని చేస్తున్నట్లు అనిపిస్తోంది' అని ఝౌ చెప్పారు.

ఇలాంటివి ప్రస్తుతం చైనాలోని షెంజెన్, షాంఘై, నాంజింగ్, వుహాన్, చెంగ్డూ, కుమింగ్ సహా అన్ని పెద్ద నగరాల్లో కనిపిస్తున్నాయి. అక్కడ కంప్యూటర్లు, ఇంటర్నెట్, మీటింగ్ రూములు, కెఫెటేరియాలను చూస్తే నిజంగానే ఆఫీసు నడుస్తున్నట్లు అనిపిస్తుంది. ఆఫీసుకు వచ్చినవాళ్లు అక్కడ ఖాళీగా కూర్చున్నా, కంప్యూటర్లలో ఉద్యోగాల కోసం వెతుకుతున్నారు. కొంతమంది సొంత వ్యాపారాన్ని ప్రారంభించేందుకు ప్లాన్ చేసుకుంటున్నారు. నిరుద్యోగ యువకుల నుంచి కొన్ని ఆఫీసులు 30 నుంచి 50 యువాన్లు వసూలు చేస్తూ లంచ్, స్నాక్స్, డ్రింక్స్ అందిస్తున్నాయి.

న్యూజీలాండ్‌లోని విక్టోరియా యూనివర్సిటీ ఆఫ్ వెల్లింగ్టన్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో సీనియర్ లెక్చరర్‌గా ఉన్న డాక్టర్ క్రిస్టియన్ యావోకు చైనా ఆర్థిక వ్యవస్థ గురించి సమగ్ర అవగాహన ఉంది. 'పని చేస్తున్నట్లు నటించడం ఇప్పుడు సర్వసాధారణం. ఆర్థిక రంగంలో జరుగుతున్న మార్పులు, విద్య, ఉద్యోగాల మధ్య సమతుల్యత లేకపోవడం, తర్వాత ఏం చేయాలనే దాని గురించి ఆలోచించడానికి, మార్పుల్లో భాగంగా లభించే చిన్న ఉద్యోగాలు చేయడానికి యువతకు ఇలాంటి ప్రదేశాలు అవసరం' అని ఆయన చెప్పారు. 'మార్పులకు సంబంధించిన పరిష్కారాల్లో ఇలాంటి ఆఫీసు ఒకటి' అని క్రిస్టియన్ యావో అభిప్రాయపడ్డారు. సోషల్ మీడియా సైట్ జియాహోంగ్షు బ్రౌజ్ చేస్తుండగా, ప్రిటెండ్ టు వర్క్ కంపెనీ గురించి ఝౌ తెలుసుకున్నారు. ఆఫీసు వాతావరణం వల్ల స్వీయ క్రమశిక్షణ మెరుగుపడుతుందని భావించినట్లు ఆయన చెప్పారు. ఆయన ఆ ఆఫీసులో చేరి మూడు నెలలైంది. తాను పని చేస్తున్నట్లు నటిస్తున్న ఆఫీసు ఫోటోలను ఝౌ తన తల్లిదండ్రులకు పంపించారు. ఇప్పుడాయనకు ఉద్యోగం లేకపోయినప్పటికీ వాళ్లు ప్రశాంతంగా ఉన్నారని చెప్పారు. ఆఫీసుకు వచ్చేవాళ్లు తమకు కావల్సినప్పుడు రావచ్చు, పోవచ్చు.

ఝౌ ఉదయం ఎనిమిది లేదా తొమ్మిది గంటల మధ్య ఆఫీసుకు వస్తుంటారు. కొన్నిసార్లు రాత్రి 11 గంటల వరకు అక్కడే ఉంటారు. ఆ ఆఫీసు మేనేజర్ కూడా వెళ్లిపోయిన తర్వాత ఇంటికి వెళతారు. మిగతావారు స్నేహితులయ్యారని ఝౌ చెప్పారు. వారిలో ఎవరో ఒకరు ఉద్యోగం కోసం వెదుకుతుంటారని, మిగతా వారు జోక్‌లు చెప్పుకోవడం, ఆడుకోవడం లాంటివి చేస్తుంటారు. పని పూర్తైన తర్వాత వాళ్లంత అప్పుడప్పుడు డిన్నర్ కూడా కలిసి చేస్తారు. ఇలా కొంతమంది ఒక టీమ్‌లాగా ఏర్పడటం తనకు నచ్చిందని, తాను ఆఫీసులో చేరినప్పటి కంటే ఇప్పుడు చాలా సంతోషంగా ఉన్నానని ఝౌ చెప్పారు. షాంఘైకి వస్తే, నిరుద్యోగ యువకులు డబ్బులిచ్చి ఉద్యోగం చేస్తున్నట్లు నటించేందుకు ఏర్పాటుచేసిన ఆఫీసులో ఒక వర్క్ స్టేషన్‌ను జియోవెన్ టాంగ్ ఈ ఏడాది మొదట్లో అద్దెకు తీసుకున్నారు.

23 ఏళ్ల ఈ యువతి గతేడాది యూనివర్సిటీలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. ఆమెకు ఇప్పటి వరకు ఫుల్‌టైమ్ జాబ్ దొరకలేదు. గ్రాడ్యుయేషన్ పూర్తైన ఏడాది లోపు విద్యార్థులు తప్పనిసరిగా ఉద్యోగంలో చేరాలి, లేదా ఏదైనా సంస్థలో ఇంటర్న్‌షిప్ చేస్తున్నట్లు ఆధారం సమర్పించాలని ఆమె చదువుకున్న యూనివర్సిటీలో ఒక అలిఖిత నియమమం ఉంది. అలా చేయకపోతే యూనివర్సిటీ వారికి డిప్లొమా ఇవ్వదు. అద్దెకు తీసుకున్న ఆఫీసులో ఫోటోలు దిగి తాను ఇంటర్న్‌షిప్ చేస్తున్నానని, అందుకు ఆ ఫోటోలే ఆధారమని ఆమె వాటిని యూనివర్సిటీకి పంపించారు. ఆమె రోజూ డబ్బులు చెల్లించి ఆఫీసులో కూర్చుని ఆన్‌లైన్‌లో నవలలు రాస్తూ కొంత పాకెట్ మనీ సంపాదిస్తున్నారు. 'మీరు నటిస్తున్నట్లైతే, చివరి వరకు నటించండి' అని టాంగ్ చెప్పారు.

'ఉద్యోగ అవకాశాలు లేకపోవడం వల్ల కలిగే నిరాశ, అసహనంలో నుంచి ఉద్యోగాలు చేస్తున్నట్లు నటించే ధోరణి ఏర్పడింది' అని జర్మనీలోని మాక్స్‌ప్లాంక్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ సోషల్ ఆంత్రోపాలజీ డైరెక్టర్ డాక్టర్ బియావో జియాంగ్ చెప్పారు. 'పని చేస్తున్నట్లు నటించే యువకులు తమను తాము సురక్షిత వలయంలో బంధించుకుంటున్నారు. దీనివల్ల వారు సమాజం నుంచి దూరం జరిగినా అది వారికి కొంత సౌలభ్యాన్ని ఇస్తుంది' అని ఆయన అన్నారు.

డోంగుగువాన్ నగరంలో ప్రిటెండ్ టు వర్క్ అనే ఆఫీసు స్థాపించిన 30 ఏళ్ల ఫీయు (పేరు మార్చాం) 'నేను వర్క్ స్టేషన్ అమ్మడం లేదు. పని లేని వ్యక్తిగా ఉండకపోవడం అనే గౌరవాన్ని అమ్ముతున్నా' అని చెప్పారు. ఆయన గతంలో నిరుద్యోగి. రిటైల్ వ్యాపారం చేసిన ఆయన కోవిడ్ సంక్షోభ సమయంలో దాన్ని మూసివేశారు.

'ఆ సమయంలో నేను చాలా ఆందోళనగా ఉన్నా. జీవితం ముగిసిందని అనిపించింది. ఈ పరిస్థితిని మార్చాలనుకున్నా. అయితే నా దగ్గర అంత శక్తి లేదు' అని ఆయన గుర్తు చేసుకున్నారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఆయన ప్రిటెండ్ టు వర్క్ గురించి ప్రచారం చేయడం ప్రారంభించారు. నెలలోనే ఆ వర్క్‌స్టేషన్ నిండిపోయింది. కొత్తగా చేరాలనుకునే వారు ఇప్పుడు అందులో దరఖాస్తు చేసుకోవాలి. తన కంపెనీకి వచ్చేవారిలో 40 శాతం మంది యూనివర్సిటీ గ్రాడ్యుయేట్లు ఉన్నారని, వారు ఫోటోలు తీసుకుని తాము అక్కడ ఇంటర్న్‌షిప్ చేస్తున్నట్లు ట్యూటర్లకు ఫోటోలు పంపిస్తున్నారని ఫీయు చెప్పారు. తల్లిదండ్రుల నుంచి ఒత్తిడి తట్టుకోలేక వస్తున్న వారి సంఖ్య చాలా తక్కువగా ఉంది. మిగిలిన 60 శాతం మంది ఫ్రీలాన్సర్లు. అందులో ఎక్కువ మంది డిజిటల్ నోమాడ్లు. వారిలో కొందరు పెద్ద పెద్ద ఈ కామర్స్ సంస్థలు, సైబర్ స్పేస్ రైటర్లుగా పని చేశారు. వారి సగటు వయసు 30. అందులో అందరి కంటే చిన్న వ్యక్తి వయసు 25 ఏళ్లు.

అధికారికంగా వీళ్లను 'ఫ్లెక్సిబుల్ ఎంప్లాయిమెంట్ ప్రొఫెషనల్స్' అని పిలుస్తున్నారు. వీరిలో క్యాబ్ డ్రైవర్లు, ట్రక్ డ్రైవర్లు ఉన్నారు. ఇలాంటివి దీర్ఘకాలంలో లాభదాయకంగా ఉంటాయా లేదా అనేది ప్రశ్నార్థకమని ఫీయు చెబుతున్నారు. ఇది వ్యాపారంలా కాకుండా సామాజిక ప్రయోగంగా చూడటానికి ఆయన ఇష్టపడుతున్నారు. 'ఇది గౌరవం కోసం అబద్దాలు చెబుతుంది. అయితే కొంతమంది వాస్తవాన్ని తెలుసుకోవడంలో ఉపయోగపడుతుంది. ఆఫీసుకు వచ్చే వారు దీర్ఘకాలం నటిస్తుంటే మేము మోసం చేస్తున్నట్లే' అని ఆయన చెప్పారు. 'వారు నటిస్తున్న వర్క్ ప్లేస్‌ను నిజమైన ఆఫీసుగా మార్చేందుకు సాయం చేయడంలో ఈ ప్లేస్ ఉపయోగపడితే ఈ సామాజిక ప్రయోగం విజయవంతమైనట్లే' అని ఫీయు అభిప్రాయ పడ్డారు. ఝౌ ప్రస్తుతం తన ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడంలో ఎక్కువ సమయం గడుపుతున్నారు. కొన్ని సంస్థలు తమ నియామకాలలో ఏఐ టూల్స్‌లో నిపుణులకు ప్రాధాన్యత ఇవ్వడాన్ని తాను గుర్తించానని అన్నారు. అందుకే ఏఐ నైపుణ్యాలు నేర్చుకోవడం వల్ల ఫుల్‌టైమ్ జాబ్ సంపాదించడం తేలికవుతుందని ఆయన భావిస్తున్నారు.

సిల్వియా చాంగ్, బీబీసీ కోసం



# నో ఎమోషన్స్, నో మోరాలిటీ..

# డబ్బు కక్కుర్తి మాత్రమే!



డొనాల్డ్ ట్రంప్.. ఈ 79 ఏళ్ల అమెరికన్. భారతీయులకే కాదు.. ప్రపంచ దేశాలకే పెద్ద టెర్రర్ ఇప్పుడు. ఒక్క పాకిస్థాన్ ఆర్మీ చీఫ్‌కు తప్ప..! తన వ్యక్తిగత జీవితం అంతా రోత. బోలెడు కథలు. వావీ వరుసలూ పట్టని కూతలు, చేతలు.. కేసులు కూడా.

తనకు డబ్బు కావాలి.. తనొక ఫుల్ టైమ్ వ్యాపారి, జస్ట్ పార్ట్ టైమ్ రాజకీయ నాయకుడు. మొన్నీమధ్య ఇంగ్లిష్ మీడియాలో కనిపించిన ఓ వార్త మరీ పీక్స్ అనిపించింది. తనకు ఎమోషన్సూ మన్నూ మశానం ఏమీ ఉండవనీ అర్థమైంది.

2022లో తన మాజీ భార్య ఇవానా మరణించినప్పుడు, ఆమెను స్మశానవాటికలో కాకుండా, న్యూజెర్సీలోని డొనాల్డ్ ట్రంప్ బెడ్‌మినిస్టర్ గోల్ఫ్ కోర్స్‌లోని మొదటి హోల్ దగ్గరే సమాధి చేశారు. ఇది వ్యక్తిగత నిర్ణయం లాగానే కనిపించినా, అది ఎమోషన్ కాదు, పక్కా ఓ పన్ను ఎగవేత, డబ్బు కక్కుర్తి యవ్వారం అనే వార్తలు వస్తున్నాయి.

ఇవానా, 73 ఏళ్ళ వయసులో, న్యూయార్క్ మాన్‌హాటన్‌లోని తన ఇంట్లో పడి, గాయాలతో మరణించింది. చాలామంది ప్రముఖులలాగా కాకుండా, ఆమె సమాధికి ఎటువంటి కంచె, పబ్లిక్ స్మారక చిహ్నం లేకుండా, మొదటి హోల్ పక్కనే ఒక సాదాసీదా శిలాఫలకమే ఉంది ప్రస్తుతం. అక్కడ పాతిపెట్టబడిన ఏకైక వ్యక్తి ఆమెనే.

న్యూజెర్సీ రాష్ట్ర పన్నుల చట్టం ప్రకారం.. స్మశానవాటిక కోసం కేటాయించిన భూమి అన్నిరకాల పన్నులు, లెవీల నుంచి మినహాయింపు పొందుతుంది. స్మశానవాటిక సంస్థలకు రియల్ ఎస్టేట్ పన్ను, వ్యక్తిగత ఆస్తి పన్ను, వ్యాపార పన్ను, సేల్స్ టాక్స్, ఆదాయ పన్ను, వారసత్వ పన్ను.. అన్నింటి నుంచీ మినహాయింపు ఉంటుంది.

ఒకే ఒక్క సమాధి కూడా ఆ భూమిని చట్టబద్ధంగా 'పన్నురహిత భూమి'గా మార్చగలదు. న్యూజెర్సీ చట్టంలో ఉన్న ఈ మినహాయింపును ఉపయోగించుకోవడానికి, ట్రంప్ ఆ గోల్ఫ్ కోర్స్ భూమిని 'లాభాపేక్షలేని స్మశానవాటిక సంస్థ'గా రిజిస్టర్ చేశారని అమెరికన్ సోషల్ మీడియా పేర్కొంటోంది. ఈ రిజిస్ట్రేషన్‌తో ఆ స్థలపు పన్ను స్థితి మారి, మొత్తం ఆస్తి పన్నుల నుంచి మినహాయింపు పొందే అవకాశం ఏర్పడింది.

ట్రంప్ నిశ్శబ్దంగా ఈ భూమిని నాన్‌ప్రాఫిట్ సెమెటరీ కంపెనీగా నమోదు చేశారు. ఒక సమాధి.. అంతే, మొత్తం గోల్ఫ్ కోర్స్‌కు పన్ను మినహాయింపులు. కోట్ల రూపాయల పన్ను ఆదా.. క్లబ్‌హౌస్‌కి 150 అడుగుల దూరంలో, గోల్ఫ్ మొదటి హోల్ పక్కనే ఇది ఒక లీగల్ లూప్‌హోల్.

ఇది కేవలం ఒక సమాధి గురించి కాదు.. ధనవంతులు, ట్రంపు వంటి వ్యాపారులు సాధారణ ప్రజలు ఎప్పుడూ గుర్తించని చట్టాలను ఎలా ఉపయోగించుకుంటారో చెప్పే పాఠం. చట్టంలోని లూప్ హోల్స్ వాడుకోవడానికి వాళ్లు నైతికతను, భావోద్వేగాలను వదిలేస్తారు.

నిజానికి ట్రంప్ ఫ్యామిలీ ట్రస్ట్ ఒకసారి ఈ బెడ్‌మినిస్టర్ గోల్ఫ్ కోర్స్‌కు 20 మైళ్ల దూరంలో ఉన్న న్యూజెర్సీ హాకెట్‌స్టౌన్‌లోని భూమిని కూడా నాన్‌ప్రాఫిట్ స్మశానవాటిక సంస్థగా గుర్తించడానికి ప్రయత్నించింది. కాలక్రమేణా బెడ్‌మినిస్టర్ గోల్ఫ్ కోర్స్‌కి సంబంధించిన ట్రంప్ ఆలోచనలు కూడా మారాయి.

మొదట ట్రంప్ తన కోసం అక్కడ ఒక




మౌసోలియం (స్మారక గృహం) నిర్మించాలనుకున్నారు. తర్వాత వెయ్యికి పైగా సమాధులు ఉండే స్మశానవాటిక ఏర్పరిచే ప్రణాళిక చెప్పారు.. 10 సమాధులు మాత్రమే ఉండే చిన్న ప్రైవేట్ ఫ్యామిలీ సెమెటరీ ప్రతిపాదించారు.. ఆ తర్వాత 284 సమాధులు అమ్మకానికి పెట్టే పెద్ద సెమెటరీ ప్రణాళిక రూపొందించారు.

సహజంగానే మీడియా రిపోర్టులను ట్రంప్ ఖండించారు. 525 ఎకరాల తన ఆస్తిలో, తన ఖరీదైన, అందమైన భూమిలోనే ఆమెను ఖననం చేయాలనేది తన కోరికగా వ్యక్తీకరించారు. చెబుతాడు.. తను ఏదైనా చెప్పగలడు..!!

- ముచ్చట సౌజన్యంతో..

## లావేరు శాఖా గ్రంథాలయంలో

# రంగనాథన్ జయంతి



(సత్యంన్యూస్, లావేరు)

లావేరు శాఖా గ్రంథాలయంలో మంగళవారం గ్రంథాలయ పితామహుడు డాక్టర్ ఎస్సార్ రంగనాథన్ జయంతి వేడుకలు నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు పూల మాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంగనాథన్ లైబ్రరీసైన్స్ రంగంలో దూరదృష్టి గల మార్గదర్శకుడని అన్నారు. గ్రంథాలయ నిర్వహణ సమాచార సేవలను వేగంగా చదువులకు అందించడంలో ఆ సంస్థలను విప్లవత్మాకంగా మార్చివేయడంలో పరిశోధనా శాస్త్రవేత్తగా నిలిచారని తెలిపారు. ఈ సందర్భంగా రంగనాథన్ జీవిత చరిత్రపై నిర్వహించిన వ్యాసరచన పోటీలో గెలుపొందిన డి.గంగకు ప్రథమ, బి.రాజేష్‌కు ద్వితీయ, పి.రమణకు తృతీయ బహుమతులు గ్రంథాలయం తరపున అందజేశారు. జాతీయ గ్రంథాలయాధికారుల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకుడు టి.వీరభద్రుడు, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.















# గట్టు గుట్టు తేల్చాలి

- రెవెన్యూ సిబ్బందికి తహసీల్దారు మెమోలు
- 'సత్యం' కథనానికి స్పందన




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

బలగ నాగావళి వరదగట్టు గుట్టు తేల్చేపనిలో రెవెన్యూ అధికారులు నిమగ్నమయ్యారు. ఆదివారంపేట దాటిన తర్వాత శ్రీకాకుళం-ఆమదాలవలన ప్రధాన రోడ్డుకు ఆనించి ఉన్న సర్వే నెంబర్1 లోని సబ్ డివిజన్లు 1 నుంచి 5 వరకు సుమారు 1.80 ఎకరాల నాగావళి వరదగట్టు (ప్రభుత్వ భూమి)కి కంచె వేసి కబ్జా చేసిన అంశంపై తహసీల్దారు ఎన్.గణపతి మండల రెవెన్యూ సిబ్బందికి సోమవారం మెమోలు జారీ చేశారు. శ్రీకాకుళం మండలం బలగ రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్ 1లో సబ్‌డివిజన్లు 1 నుంచి 5 వరకు ఉన్న సర్వే నెంబర్లలో కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూమి కబ్జాకు గురైందని 'సత్యం'లో వచ్చిన కథనానికి శ్రీకాకుళం మండల రెవెన్యూ అధికారులు స్పందించారు. సదరు సర్వే నెంబర్-1లో ఉన్న సబ్ డివిజన్లను సర్వే చేసి నివేదిక ఇవ్వాలని మండల సర్వేయర్, ఆర్ఐ, స్థానిక విలేజ్ సర్వేయర్, స్థానిక వీఆర్వోలకు మెమోలు జారీ చేశారు. సదరు నాగావళి వరద గట్టును ఆక్రమించిన వారి వివరాలు, భూమి స్వభావాన్ని తెలియజేయాలని ఆదేశించారు. రెవెన్యూ అధికారులు 2023లో ప్రభుత్వ భూమిగా గుర్తించిన నాగావళి వరద గట్టుపై మూడు సార్లు హెచ్చరిక బోర్డు ఏర్పాటుచేస్తే, వాటిని తొలగించి హద్దురాళ్లు, కంచె వేశారని సోమవారం గ్రీవెన్స్‌లో ఆదివారంపేటకు చెందిన బోనెల చిరంజీవి ఫిర్యాదు చేశారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ స్వయంగా పరిశీలించి చర్యలు తీసుకుంటానని ఫిర్యాదుదారుకు చెప్పారు. దీంతో తహసీల్దార్ ముందుగానే 'సత్యం'లో వచ్చిన కథనానికి స్పందించి మెమోలు జారీ చేశారు. నాగావళి వరద గట్టును జేసీబీలతో తవ్వి మట్టిని చదును చేసి చుట్టూ కంచె, హద్దు రాళ్లు వేసిన బలగకు చెందిన ఆ నలుగురు ఫేక్ పత్రాలతో స్థానిక రెవెన్యూ సిబ్బంది ద్వారా వ్యవహారం చక్కబెట్టడానికి ప్రయత్నాలు చేస్తున్నారని ఫిర్యాదుదారుడు బోనెల చిరంజీవి ఆరోపిస్తున్నారు. కొందరు రెవెన్యూ సిబ్బంది నిర్వాకం వల్లనే నాగావళి వరదగట్టు ఆక్రమణకు గురైందని ఆరోపిస్తున్నారు. ఆక్రమణలు తొలగించి భూమిని ప్రభుత్వ స్వాధీనం చేసుకునేంత వరకు పోరాటం ఆగదని ఫిర్యాదుదారుడు బోనెల చిరంజీవి పేర్కొన్నారు.

## మురపాక మండలానికి మద్దతుగా

# పంచాయతీల నుంచి తీర్మానాలు సేకరణ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా జిల్లాలు, మండలాల పునర్విభజనకు గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చిన నేపథ్యంలో శ్రీ వివేకానంద యూత్ సొసైటీ, మురపాక మండల సాధన సమితి ఆధ్వర్యంలో మురపాక మండల సాధన సమితి సభ్యులు మురపాక మండల కేంద్రానికి అనుకూలంగా ఉన్న 10 పంచాయతీల సర్పంచుల నుంచి తీర్మానాలు సేకరించారు. మురపాక మండల కేంద్రం ఏర్పాటుకి అనుకూలంగా మురపాక పరిసర పంచాయతీలైన మురపాక, చిన్న మురపాక, కేశవరాయునిపాలెం, లోపెంట, నేతేరు లక్ష్మిపురం, గుంటుకుపేట, చిన్నయ్యపేట, బయ్యన్నపేట, చిత్రిపేట, బుడుమూరు పంచాయతీల సర్పంచులు తీర్మానాలు



అందజేశారని శ్రీవివేకానంద యూత్‌సొసైటీ అధ్యక్షులు బాలి శ్రీనివాసనాయుడు తెలిపారు. మురపాక మండలం ఏర్పాటుకి జనాభా ప్రాతిపదికన సరిపడకపోతే మురపాకకి దగ్గరగా ఉన్న ఎచ్చెర్ల మండలంలోని పలు పంచాయతీల గ్రామపెద్దలను కలిసి వారి మద్దతు కూడగడతామని ఆయన తెలిపారు. ఈ తీర్మానాలన్నింటిని ఈ నెల 13న అమరావతిలో నూతన జిల్లాలు, మండలాల ఏర్పాటుపై రాష్ట్ర ప్రభుత్వం వేసిన రాష్ట్ర కేబినెట్ సబ్ కమిటీ మొదటి సమావేశంలో అందజేస్తామని ఆయన తెలిపారు.

ఈ కార్యక్రమాలలో మురపాక మండలం సాధన సమితి ఎంఎంఎస్ సభ్యులు గొర్లె శ్రీనుబాబు, వండాన రాంబాబు, పేరూరి గురునాథ్, 10 పంచాతీల సర్పంచులు మీసాల సీతంనాయుడు, పెయ్యల లక్ష్మణ రావు, కొన్ని హేమసుందర్, పెదనాయిని చిట్టి, పైడయ్య రెడ్డి, కొన్ని సత్యం, కలిశెట్టి భాస్కరరావు, చిత్రి విజయ్‌కుమార్, ఆదినారాయణ, కొల్లి ఈశ్వర్‌రెడ్డి & ఎంపీటీసీలు తేనెల సురేష్ కుమార్, అలుపన రమణమ్మ, లెంక రామినాయుడు పాల్గొన్నారు.

## పులివెందులలో ప్రజాస్వామ్యం ఖూనీ అయింది

- వైకాపా జిల్లా ప్రధాన కార్యదర్శి గేదెల పురుషోత్తం -



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ స్థానాలకు జరుగుతున్న ఉపఎన్నికల్లో ప్రజాస్వామ్యం ఖూనీ అయిందని వైకాపా జిల్లా ప్రధాన కార్యదర్శి గేదెల పురుషోత్తం అన్నారు. ఈమేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నియోజకవర్గ పరిధిలో వైకాపా నేతలందర్నీ హౌస్ అరెస్ట్ చేసి, ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసి, పక్క జిల్లాల నుంచి వచ్చినవారితో టీడీపీ నేతలు దగ్గరుండి ఓట్లేయించారని ఆయన ఆరోపించారు. మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి ఒంటిమిట్టలో నేరుగా పోటీలో ఉన్న అభ్యర్థినే బెదిరించారని, పులివెందులలో దొంగ ఓట్లు వేస్తూ దొరికిన ఇతర ప్రాంతాలకు చెందిన టీడీపీ నాయకులు ఉన్నారని ఆయన అన్నారు. రాష్ట్రంలో టీడీపీ అరాచకం రాజ్యమేలుతుందని చెప్పడానికి ఇదే పెద్ద ఉదాహరణ అన్నారు. టీడీపీ, పోలీసులు కలిసి వ్యూహాత్మకంగా కుట్ర చేశారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీ అవినాష్ రెడ్డిని అక్రమంగా అరెస్ట్ చేసి, ఆయన ఇంటిని ధ్వంసం చేశారని, మంగళవారం సాయంత్రం వరకూ అవినాష్ రెడ్డిని తిప్పాలనుకున్నా ప్రజలు తిరగబడటంతో ఎర్రగుంట్లలో వదిలిపెట్టారని పురుషోత్తం ఆరోపించారు.

# ఉద్దానాన్ని విధ్వంసం చేస్తే సహించేది లేదు

(సత్యంన్యూస్, మందస)

కార్గో ఎయిర్ పోర్ట్ పేరుతో ఉద్దానాన్ని విధ్వంసం చేస్తే సహించేది లేదని సీపీఐ పార్టీ జాతీయ సహాయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. కార్గో ఎయిర్ పోర్ట్ పేరుతో దోపిడీకి పాల్పడితే సహించేది లేదని, అలా కాదని ముందుకెళ్తే ప్రజా ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. కార్గో ఎయిర్ పోర్ట్‌కి వ్యతిరేకంగా, బలవంతపు భూసేకరణ ఆపాలని కోరుతూ ఎయిర్‌పోర్ట్ ప్రభావిత గ్రామాల్లో పర్యటిస్తూ యం.గంగువాడ నుంచి రామాపురం వరకు ర్యాలీ జరిగింది. ర్యాలీకి అగ్రభాగాన సిపిఐ జాతీయ నాయకులు కె.నారాయణ, సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సిపిఐ యంయల్ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాశ రావు, లిబరేషన్ పార్టీ జిల్లా నాయకులు మద్దిల రామారావు సిపిఐ జిల్లా కార్యదర్శి చేపర వెంకటరమణ, కార్గో ఎయిర్పోర్ట్ వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కొమర వాసు, జోగి అప్పారావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం కార్గో ఎయిర్ పోర్ట్ వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్షులు కొమర వాసు అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో నారాయణ మాట్లాడుతూ ఎయిర్ పోర్ట్ పేరుతో బలవంతంగా భూములు తీసుకోవడం వల్ల ఇక్కడ ప్రజలు నిరాశ్రయులు అవుతారని ఆవేదన వ్యక్తం చేశారు. గోవిందరావు మాట్లాడుతూ కార్పొరేట్ కంపెనీల కోసం ప్రజల భూములు లూటీ చేస్తారా అని ప్రశ్నించారు. జాతీయస్థాయిలో గుర్తింపు తెచ్చిన ఉద్దానం జీడి పంటని కార్గో ఎయిర్ పోర్ట్ పేరుతో లక్షలాది చెట్లు నరికివేయడం వల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని, జీడి ఆధార పరిశ్రమలు దెబ్బతిని వేలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు



సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కే.మోహనరావు, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి వంకల మాధవరావు, పీవోడబ్ల్యూయు జిల్లా కార్యదర్శి పి.కుసుమ, జీడి రైతుసంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్‌కుమార్, జోగి శ్రీదేవి, జి.బాలకృష్ణ, జోగి కొండందరావు, పోరాట కమిటీ నాయకులు, రామాపురం సర్పంచ్ పొట్టి ధర్మారావు, ధనంజయరావు, డి.రామారావు, ఎం.తులసిరావు, గుంటు రామస్వామి, లండ రామస్వామి, ఎం.సంతోష్, చిత్త గున్నయ్య, కోనేరు రమేష్, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## 18న సీఎం జిల్లా పర్యటన..?

(మొదటిపేజీ తరువాయి)

పర్యటించారు. ఇప్పుడు మూడోసారి పాస్‌బుక్‌లు పంపిణీ చేయడానికి శ్రీకాకుళం జిల్లాను వేదికగా చేసుకుంటున్నారు. జిల్లాలో ఎక్కడ, ఎప్పుడు పర్యటిస్తారన్న షెడ్యూల్ ఖరారు కాకపోయినా సీఎం చంద్రబాబు పర్యటన ఖాయమైందని అధికారులు చెబుతున్నారు. ఈ నెల 15 తర్వాత చంద్రబాబు పర్యటన ఉంటుందని సీఎంవో నుంచి ఉన్నతాధికారులకు మంగళవారం ఉదయం సమాచారం అందినట్టు కలెక్టరేట్ అధికారులు చెబుతున్నారు. చంద్రబాబు పర్యటనకు యంత్రాంగాన్ని సిద్ధంగా ఉండాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేశారు.




## రాహుల్, ప్రియాంకగాంధీల అరెస్ట్ అన్యాయం

(సత్యంన్యూస్, ఆమదాలవలస)



శాంతియుతంగా రాహుల్ గాంధీ చేపట్టిన ప్రజాస్వామ్య పరిరక్షణ యాత్ర అడ్డుకొని రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ఇండియా కూటమి నాయకులను అరెస్ట్ చేయడం అన్యాయమని కాంగ్రెస్ పార్టీ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సనపల అన్నాజీ రావు ధ్వజమెత్తారు. ఈమేరకు పట్టణ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గడిచిన ఎన్నికల్లో జరిగిన అవకతవకలు, దొంగ ఓట్లు అలాగే పోలింగ్ శాతం గణనీయంగా పెరగడంపై రాహుల్‌గాంధీ చేస్తున్న పోరాటం ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడానికి వేస్తున్న పునాది అన్నారు. ఆయన చేస్తున్న పోరాటానికి దేశ మొత్తం మద్దతు తెలియజేస్తుందన్నారు. రాహుల్‌గాంధీ ప్రతిపక్ష నాయకుడి హోదాలో పార్లమెంట్ నుంచి ఎన్నికల కమిషన్ వరకు చేపట్టిన ప్రజాస్వామ్య పరిరక్షణ యాత్రలో 300 మంది ఎంపీలకు పైగా మద్దతు తెలియజేశారన్నారు. దీనిపై బీజేపీ, ఎన్నికల కమిషన్ కుటిల బుద్ధి చూపించి రాహుల్, ప్రియాంక, ఇండియా కూటమి నాయకులను  అరెస్టు చేయడం అన్యాయమన్నారు.

## ఎస్ ఆర్ రంగనాథన్ జయంతి వేడుకలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

బలగ హడ్కో కాలనీలో గల శాఖా గ్రంథాలయంలో మంగళవారం గ్రంథాలయ పితామహుడు డాక్టర్ ఎస్.ఆర్.రంగనాథన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మొదటగా ఆయన చిత్రపటానికి గ్రంథాలయాధికారి పి.ఉగ్రసేను పూలమాలవేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయ నిర్వహణ సమాచార సేవలను వేగంగా చదువరులకు అందించడంలో విప్లమాత్మకంగా మార్చివేయడంలో పరిశోధన శాస్త్రవేత్తగా నిలిచారన్నారు. గ్రంథాలయ శాస్త్రంలో పంచ సూత్రాలు ప్రవేశపెట్టి వాటిని విస్తృతంగా ప్రచారం చేశారని వివరించారు. ఆయన జయంతి సందర్భంగా ఈరోజు లైబ్రేరియన్స్‌డే జరుపుకుంటారన్నారు. కార్యక్రమంలో సహాయకురాలు కె.అనిత, పాఠకులు తదితరులు పాల్గొన్నారు.



### హాస్టల్ విద్యార్థులు వెళ్లిపోవడానికి

# జిల్లా అధికారులే కారణం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఇటీవల పట్టులోగాం గిరిజన సంక్షేమ హాస్టల్‌లో జరిగిన పరిణామాలు పూర్తిగా జిల్లా అధికారుల వైఫల్యమేనని గిరిజన సంఘం జిల్లా నాయకులు సవర పాల్గుణ, సవర ధర్మారావులు ఆరోపించారు. పట్టులోగాం గిరిజన సంక్షేమ హాస్టల్‌ను మంగళవారం గిరిజన సంఘం సభ్యులతో కలిసి సందర్శించారు. హాస్టల్‌ను పరిశీలించిన అనంతరం వారు పత్రికల వారితో మాట్లాడుతూ విద్యార్థులపట్ల అనుచితంగా ప్రవర్తించిన ముగ్గురు టీచర్లను ఈ హాస్టల్ నుండి బదిలీ చేయాలని కోరితే వారిని కాకుండా వేరే వారిని ఒకరిని బదిలీ చేయడం వల్ల, సమస్య పరిష్కారం కాదని భావించిన విద్యార్థులు హాస్టల్ నుండి ఖాళీ చేసి వెళ్ళిపోయారని, దీనికి పూర్తి బాధ్యత జిల్లా అధికారులే వహించాలని డిమాండ్ చేశారు. హాస్టల్ సమస్యల పరిశీలనకు వచ్చిన డీడీ అన్నదొర, ఏటిడబ్ల్యూఓ మల్లికార్జునరావులు విద్యార్థుల భవిష్యత్‌తో ఆటలాడుకోవడం సరైంది కాదన్నారు. ఈ విషయంపై జిల్లా అధికారులు సరైన చర్యలు చేపట్టకపోతే అన్ని ప్రజాసంఘాలను కలుపుకొని ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్మన్ సవర లక్ష్మీనారాయణ, గిరిజన సంఘం నాయకులు సవర నాగేశ్వరరావు, నర్సింగులు, యస్ బలరాం, యస్ జగన్, యస్ రవి, తదితరులు పాల్గొన్నారు.



గ్రంథాలయ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక గ్రంథాలయంలో ఎస్ఆర్ రంగనాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ గ్రంథాలయ అధికారి బబ్బురు గణేష్ బాబు, రిటైర్డ్ మాష్టర్ జి.దుర్గారావు, డి.శ్యామలరావు, భాస్కర్ రావు, అడ్మిన్ శివ, సహాయకుడు ఈశ్వర్ పాల్గొన్నారు.

- సత్యంన్యూస్, పాలకొండ

## ఎంపీయూపీ పాఠశాల సందర్శన

(సత్యంన్యూస్, ఎల్.ఎన్.పేట)

మండలంలోని కోవిలాం ఎంపీయూపీ పాఠశాలలో మండల విద్యాశాఖ అధికారి కె.చంద్రమౌళి సందర్శించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం పరిశీలించి వంటవారికి శుభ్రతపై కొన్ని సూచనలు చేశారు. అనంతరం నులిపురుగుల దినోత్సవంపై తురక పేట ఆరోగ్య కేంద్రం డాక్టర్ పాపారావు సమక్షంలో విద్యార్థులకు నులిపురుగుల నష్టాలను తెలియజేశారు. కార్యక్రమంలో స్థానిక ఆశా కార్యకర్త ప్రధానోపాధ్యాయులు, పెద్దకోట వెంకటరావు, వెంకటలక్ష్మి, విశ్వేశ్వరరావులు పాల్గొన్నారు.



## రాహుల్ గాంధీ అరెస్టు దుర్మార్గపు చర్య

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



ఢిల్లీలో 28 పార్టీలు ఎంపీలు పార్లమెంట్ నుంచి ఈసీ భవన్ వరకు మంగళవారం చేసిన ర్యాలీని పోలీసులు అడ్డుకోవడం, వారిని అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు ఈ అక్రమ అరెస్టులతో ప్రజాస్వామ్యాన్ని పాత్ర వేశారని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు రెల్లసురేష్ పత్రికా ప్రకటన ద్వారా తెలియజేశారు, కేంద్రంలో ఉన్న బీజేపీ కూటమి ప్రభుత్వం దొడ్డిదారిలో ఎన్నికల అక్రమాలకు పాల్పడి గెలిచి ఈసీని తన గుప్పిట్లో పెట్టుకుని ఎన్నికల నిర్వహించడం ఈ అక్రమాలను రాహుల్ గాంధీ బయట పెట్టడంతో ఈసీ పనితీరు ఏ విధంగా ఉందో దేశ ప్రజలు చూస్తున్నారని ఎద్దేవా చేశారు. ఇది చాలా విడ్డూరం ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇది చెల్లదన్నారు. దేశ ప్రజలను మోసం చేయడమే కాక ఈ అక్రమ అరెస్టులను తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

# విద్యార్థులు నైపుణ్యతను పెంచుకోవాలి

## - పద్మావతి డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా



(సత్యంన్యూస్, నరసన్నపేట)

గ్రామీణ విద్యార్థుల్లో ఉద్యోగ నైపుణ్యతను పెంచేందుకు ప్రభుత్వం ప్రత్యేకదృష్టి సారించి నైపుణ్యాభివృద్ధిసంస్థ ఏర్పాటు చేసిందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. స్థానిక పద్మావతి డిగ్రీ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆద్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉద్యోగమేళాకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నైపుణ్యం గల వారికే ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా నైపుణ్యం మెరుగుపర్చుకోవాలన్నారు. నైపుణ్యాభివృద్ధి  సంస్థ మేనేజర్ సాయికుమార్ మాట్లాడుతూ ఎంపిక చేసిన డిగ్రీ కళాశాలలలో విద్యార్థులకు శిక్షణా శిబిరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థులలో నైపుణ్యాన్ని పెంచడానికి అవసరమైన వనరులను సమకూర్చామన్నారు. కళాశాల డైరెక్టర్ సిహెచ్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ తమ కళాశాలలో ప్రత్యేకంగా అన్ని పోటీపరీక్షలకు  ఆన్‌లైన్ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు, ఉపాధి అవకాశాలను మెరుగుపర్చుకునేందుకు కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు. ఈ ఉద్యోగ మేళాకు సుమారు 300మంది అభ్యర్థులు హాజరయ్యారని, వారికి ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపికైన అభ్యర్థులకు నియామకపత్రాలు అందజేసామని తెలిపారు. కార్యక్రమంలో కళింగ కార్పొరేషన్ చైర్మన్ ఆర్.కృష్ణమనాయుడు, నియోజకవర్గం టీడీపీ సమన్వయకర్త బగ్గు అర్చన, కళాశాల అడ్వైజరీ సభ్యుడు మాకెన సతీష్, పాగోటి రామచందర రావు తదితరులు పాల్గొన్నారు.



Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.